# దరిద్ర దేవతలు

శ్రీ టి. పి. విఠల్‌కుమార్

"చెప్పు! డబ్బేం చేశావో నిజం చెప్పు!" అంటూ రమేశాన్ని వాళ్ల నాన్నగారు వీపుమీద రెండు దెబ్బలు వేశారు పేక బెత్తంతో.

వాడు పెద్దగా ఏడుస్తూ "జేబుకి కన్నం ఉంది నాన్నా. డబ్బు కట్టిన పొట్లం ఎక్కడో పడిపోయింది. ఇంటి కొచ్చేవరకు నేను చూసుకో లేదు నాన్నా" అని వెక్కుతూ వెక్కుతూ చెప్పాడు.

శేఖరంగారిది చాలా బీదకుటుంబం. వారింట్లో సంపాదించేవాడు ఆయన ఒక్కడే కానీ తినే వారు మాత్రం చాలమంది ఆయన కలెక్టరాఫీసులో గుమస్తా. ఆ కొద్ది జీతంతోనే భార్యనీ, కొడుకునీ, యిద్దరు కూతుళ్లనీ పోషించాలి.

ఆయనకున్న ఆస్తి తండ్రిగారు మిగిల్చిపోయిన ఆ మూడు ఎకరముల భూమి మాత్రమే. అందులో ఒక ఎకరం ఉద్యోగం సంపాదించడానికే హారించుకుపోయింది. తక్కిన రెండు ఎకరాలు పెద్దకూతురు పెండ్లికి కొంత కట్నం క్రిందా, కొంత తతిమ్మా ఖర్చుల క్రిందా అయిపోయింది.



ఇక ఆయనకు మిగిలినది నెలంతా కష్టపడి పనిచేస్తే ఆఖరున వచ్చే ఆ జీతంరాళ్ళే. ఈ కరువు రోజులలో ఆ జీతంతోనే ఇంత మందిని పోషించాలంటే ఎలా వీలవుతుంది? పైగా కూతురు అత్తగారు కట్నం ఇంకా పూర్తిగా చేరలేదని వారానికో ఉత్తరం వ్రాస్తూంటారు. అదెలా తీర్చటం? ఇలా కష్టంగా కాలం గడుపుతున్న రోజులలో కరువులో అధికమాసం అన్నట్లు ఆయనకు ఇంకొక మగపిల్లవాడు కలిగాడు.

వాడికి పాలడబ్బాలు, మందులు తేవడానికి డబ్బెక్కడుంటుంది? ప్రతి నెలా ఆయన కొచ్చే జీతం పదవ తారీఖువరకే సరిపోతుంది. మళ్ళీ సంచీ చేత పట్టుకుని ఊరు మీద బయల్దేరవలసివచ్చేది అప్పు కోసం.

శేఖరం గారింటికీ ఆఫీసుకీ

నాలుగుమైళ్ల దూరమున్నా ఆయన రోజూ రెండుసార్లు నడిచే వెళుతూ వస్తూండేవారు. అలా వున్నప్పుడు కుర్రవాడేం బాగా వుంటాడు? వాడి ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. డాక్టరుకు చూపిస్తే మంచి ఖరీదైన మందులు వ్రాసిచ్చి కొనమన్నాడు. ఆ మందులు యిస్తేనే కాని కుర్రవాడు బ్రతకడనికూడా ఖచ్చితంగా చెప్పేశాడు. అయినా ఆ మందులు కొనడానికి కూడా డబ్బు లేదు.

శేఖరంగారు బయట కాలు పెట్టే అప్పులవాళ్ల బాధ. ఆఫీసు నుండి ఇంటికి రాగానే భార్య మందు తెచ్చారా అంటూ దీనంగా అడిగేది. వీటన్నిటితో శేఖరంగారికి పిచ్చెత్తినట్లయ్యేది. సరైన మందులు పడక కుర్రవాడికి కొన్నాళ్ళకి జబ్బు ఎక్కువైంది. శేఖరంగారు మాత్ర మేమి చేస్తారు?

ఇక ఇలా అశ్రద్ధ చేస్తే లాభం లేదని యికనైనా మంచి మందులు, ఇంజక్షన్లు ఇవ్వకపోతే కుర్రాడు బ్రతకడని నిర్ధారణ చేసుకున్నారు శేఖరంగారు. అందుచే భార్యకున్న చిన్న చిన్న బంగారు వస్తువులు అన్నీ తీసుకొని అమ్మి, ఆ డబ్బుతో మందులు కొందామని కొడుకు రమేశంతో సహా మార్వాడి దగ్గరకు బయల్దేరి వెళ్లారు. మార్వాడీ నెలాగో కాళ్లు గడ్డం పట్టుకుని ఒప్పించి ఒక వంద రూపాయలకు వస్తువులన్నీ అమ్మివేశారు.

శేఖరంగారు ఆ సొమ్మును పొట్లం కట్టి కొడుకు రమేశం చేతికి యిచ్చి యింటికి పంపిస్తూ "ఒరే! రమేశం! డబ్బు జాగ్రత్తగా తీసుకువెళ్లి అమ్మకు యియ్యి. ఆఫీసులో సెలవు పుచ్చుకొని నేనిప్పుడే వచ్చేస్తాను" అని రమేశాన్ని పంపించేశారు. వాడు మెల్లగా నడుచుకొంటూ యింటికి పోతున్నాడు.

తల్లీ, తండ్రీ పడే బాధలు వాడికేం తెలుసు? వాడి మనసుకు అనేకమైన ఆలోచనలు తట్టున్నాయి. "తమ్ముడెప్పుడూ ఏడుస్తూ బక్కచిక్కి వుంటాడు. రోజూ త్రోపుడు బండిలో పార్కుకు వచ్చే సావిత్రి తమ్ముడు చూడచక్కగా బొద్దుగా వుంటాడు. ఎప్పుడూ ఏడువనే ఏడువకుండా ఆడుకుంటూ వుంటాడు. మరి వీడో - పాలైనా త్రాగడు. ఎప్పుడూ గోల చేస్తాడు...అమ్మా, నాన్నా యెందుకో ఎప్పుడూ విచారంగా వుంటారు. నాకు స్కూలుకి జీతం కట్టలేదు. పుస్తకాలు కొనలేదు. మేష్టారు బడికి రావద్దన్నాడు. ఈ మాట నాన్నగారితో చెపితే 'నా దగ్గర డబ్బు లేదు. బడి మానేయి' అన్నారు...మరి ప్లీడరు సూర్యనారాయణగారబ్బాయి,—సత్యనారాయణ - ఎప్పుడూ కొత్త బట్టలూ, జోళ్లూ వేసుకుంటాడు. మేష్టారు చెప్పగానే పుస్తకాలు కొనేస్తాడు. అయినా ఒక్కప్రశ్నకు కూడా నాలాగా జవాబు చెప్పనే లేడు. వాడు చదువకపోయినా సరే, రోజూ వాళ్ల నాన్న కొనుక్కునేందుకు వాడికి డబ్బులిస్తూనే ఉంటాడు.

"...మరి నాకో? ఎప్పుడూ చినిగిన బట్టలే. జోళ్లు అసలు లేనే లేవు. పుస్తకాలు కొనమంటే నా దగ్గర డబ్బు లేదురా అంటారు నాన్న. నేనెంత బాగా చదివినా దమ్మిడీ అయినా యివ్వరు, కొనుక్కోడానికి. ఆ సత్తిగాడెప్పుడూ నాతో మాట్లాడనే మాట్లాడడు. వాడికి నాకూ తేడా ఏమిటో? వాళ్ల నాన్నలా మా నాన్న మంచివాడు కాదేమో?" అనుకుంటూ యిల్లు చేరుకున్నాడు.

"ఏమిరా ఇంత ఆలస్యంగా వచ్చావు? మీ నాన్నా ఏరీ? మార్వాడీ ఏమన్నాడురా?" అంటూ ప్రశ్నలవర్షం కురిపించింది వాళ్ల అమ్మ.

"నాన్న ఆఫీసుకు వెళ్లి సెలవు తీసుకుని ఇప్పుడే వస్తానన్నారమ్మా. మార్వాడి వంద రూపాయిలిస్తే పొట్లం కట్టి నీకు ఇమ్మని నా చేతికి యిచ్చారు. ఇదిగో!" అంటూ లాగూ జేబులో చేయి పెట్టాడు. కాని ఆ చేతికి ఏమీ తగులలేదు.

జేబుకన్నంలోనికి మాత్రం చేతివేళ్లు దూరాయి. వెంటనే రెండో జేబులో చెయ్యి పెట్టి వెతికాడు. అందులోనూ ఏమీ లేదు. గాబరాగా వెతికిన జేబులే మళ్ళీ మళ్ళీ వెతకడం మొదలుపెట్టేడు. లాగూ విప్పి దులిపాడు కూడా. కాని డబ్బు పొట్లం మాత్రం కనిపించలేదు.

"ఏమిటిరా వెతుకుతున్నావు? ఖర్మంచాలక డబ్బు గాని పారేశావేమిటి?" అంటూ దగ్గరసా వచ్చింది వాళ్ల అమ్మ.

"ఔనే అమ్మా! ఎంత వెదికినా కనుపించడం లేదు. జేబుకు కన్నం కూడా ఉంది. ఎక్కడో పడిపోయిందే" అంటూ ఏడుపు మొహం పెట్టాడు రమేశం. "ఓరి ముదనష్టపు వెధవా! ఎంత పని చేశావురా? మీ నాన్నగారు ఎంత కష్టపడ్డా

# ★ దురదృష్టవంతులు ★

శనిగ్రహంలా నీవు ఫలితం దక్కనీయలేదుకదరా!" అంటూ మూలలోనున్న బెత్తం తీసుకొని ఆవేశంతో ఒళ్లు తెలియక చేతికొచ్చినన్ని దెబ్బలు కొట్టడం మొదలు పెట్టింది రమేశాన్ని వాళ్ల అమ్మ.

ఇంతలో శేఖరంగారు గుమ్మంలో కాలుపెడుతూనే "ఏమిటే! వాణ్ణలా ఎందు కొడుతున్నావు?" అని అడిగారు.

"మీరిచ్చి పంపిన డబ్బు ఎక్కడో పారేశాడు—దరిద్రపు వెధవ" అంటూ మరి రెండేసింది వాళ్ల అమ్మ. వాడు ఘుల్లెగిరిపోయేటట్టు ఏడుస్తున్నాడు.

ఆ మాట వినగానే అమాంతంగా కుర్చీలో కూలబడిపోయారు శేఖరంగారు. ఆయనకు ఒళ్లు తెలియని కోపమొచ్చేసింది. ఆ కోపముతో భార్య చేతిలోని బెత్తం తీసుకొని రమేశం ఒంట్లో ఒక్క ఎముక లేకుండా చితక తన్నారు.

"చెప్పు! డబ్బేం చేశావో నిజం చెప్పు" అని రమేశాన్ని వాళ్ల నాన్నగారు వీపుమీద రెండు దెబ్బలు వేశారు బెత్తంతో.

"ఆపుహాల్యా పరిశ్రమలు"

తెలుగులో ముద్రింపబడిన అపూర్వ గ్రంథము. దీనిలో వివిధరకములైన హెయిర్ ఆయిల్సు, సబ్బులు, సెంట్లు, ఫేస్‌పౌడర్, టూత్‌పౌడర్, బూట్‌పాలిష్, స్నో, క్రీం మున్నగునవి చేయు విధానములు గలవు. ఆంధ్రప్రభ తదితర ముఖ్య పత్రికలచే దైనందిన జీవితమున కుపయోగపడు పద్ధతులుగల ఉత్తమగ్రంథమని పేర్కొనబడినది.

వెల 1-8-0 తపాలా ఖర్చులు 0-4-0 వి. పి. పద్ధతి లేదు. ఏజెంట్లకు మంచి కమీషను యివ్వబడును.

S. Muniswamy, Kavadiguda
SECUNDERABAD - Dn.

వాడు పెద్దగా ఏడుస్తూ "జేబుకి కన్నం వుంది నాన్నా. డబ్బుకట్టిన పొట్లం ఎక్కడో పడిపోయింది. ఇంటికొచ్చేవరకు నేను చూసుకోలేదు నాన్నా" అని వెక్కుతూ చెప్పాడు.

"పదరా! వెధవా పద! ఎక్కడ పారేశావో వెతుకుపో" అంటూ రమేశాన్ని జుట్టు పట్టుకొని బయటకు తోసేశారు శేఖరంగారు.

అప్పటికే చిన్న కుర్రవాడికి ఒంటిమీద తెలివి లేదు. వాడి దగ్గర కూర్చుని వాళ్లఅమ్మ విచారంగా కళ్లనీళ్లు కారుస్తోంది.

ఆ దృశ్యం శేఖరంగారు చూచి రమేశంగాడి మూలంగానే కదా వాడి మందులకని తెచ్చిన డబ్బంతా పోయింది అనుకుని వాడ్ని మరి రెండు తన్నులు తన్ని డబ్బు వెతకడానికి తనూ బయల్దేరారు. రెండు మూడు సార్లు ఇటూ అటూ తిరిగి రోడ్డంతా వెతికేరు. మార్వాడి కొట్టు దగ్గరకూడా వెతికేరు. కాని ఎక్కడా డబ్బు పొట్లం కనుపించలేదు.

శేఖరం గారికి డబ్బు కనిపించక పోయేసరికి ఇంకా కోపం ఎక్కువై పిచ్చెత్తినట్లయింది. అది ఆపుకోలేక చేతికొద్దీ రమేశాన్ని మళ్లీ కొట్టారు. వాడు ఆ దెబ్బకి "అమ్మా!" అంటూ రోడ్డుకు అడ్డంగా పరుగెత్తేడు. ఇంతలో ఒక కారువచ్చి రమేశాన్ని ఒక్క గుద్దుగుద్ది ఆగిపోయింది.

బ్రేక్ వెయ్యడానికి కూడా టైము లేకుండా దారి ప్రక్కనున్న కుర్రవాడు కారు కడ్డంగా వస్తే డ్రైవర్ మాత్రమేం చేస్తాడు? ఈ దృశ్యం చూసేసరికి శేఖరం గారికి నిజంగానే పిచ్చెక్కింది. "ఆ! ఆ! రమేశం! రమేశం!" అంటూ ఆయన వాడిమీద పడిపోయారు. ఇంతలోనే ఏదో మెరుపు మెరసినట్లుగా ఆయనకొక పొట్లాం కనుపించింది కొంచం దూరంలో. ఆయనది విప్పి చూశారు. రమేశం పారేసిన డబ్బు పొట్లమే అది! రమేశం వైపు చూశారు.

వాడి పిచ్చికంత ప్రాణాలు అప్పుడే ఎగిరిపోయాయి "ఈ డబ్బు నుంచే కదా, నీ ప్రాణాలు నా చేతులారా తీశాను రమేశం!" అంటూ శేఖరంగారు తల నేలకేసి కొట్టుకున్నారు. తర్వాత రమేశం శవాన్ని చేతులమీద వేసుకుని ఇంటికి మోసుకొచ్చారు.

గుమ్మం ఎక్కుతూండగానే ఇంట్లో ఏడుపు వినబడింది. ఇంట్లోకి వెళ్లి చూస్తే భార్య పిల్లలు చిన్న కుర్రవాడిమీద పడి ఏడుస్తున్నారు. అది చూచి శేఖరం గారికి తల తిరిగి పోయింది. ఆయన రమేశం శవంతో సహా నేలమీద దభీమని పడిపోయారు. ఆ శబ్దం విని ఆమె చిన్న కుర్రవాడి శవాన్ని వదిలి రమేశం శవంమీద పడిపోయింది.

ఇక ఆయింట్లో యేడుపులకు పెడబొబ్బలకు తక్కువా? బాకీల కోసం వచ్చిన వాళ్లంతా అప్పటికి మాత్రం వాళ్లను డబ్బు అడగకుండా వూరుకొన్నారు. ★